క్లుప్తంగా

ప్రభుత్వ బడుల తనిఖీ



వంటలను పరిశీలిస్తున్న తహసీల్దార్ మాలతి

సిరికొండ: ధర్పల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను శనివారం తహసీల్దార్ మాలతి తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నాణ్యమైన సరుకులను వినియోగించి రుచితో కూడిన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడానికి ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఉపాధ్యాయులకు సూచించారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్అర్బన్: ఫీజులు కట్టకుంటే పరీక్షలు రాయనీయమని విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శనివారం కలెక్టరేట్ పరిపాలన అధికారికి వినతిపత్రం అందజేశారు. ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు ప్రిన్స్, జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, నాయకులు నిఖిల్, విజయ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు రద్దు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజామాబాద్అర్బన్: విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్న శ్రీ చైతన్య విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ డిమాండ్ చేశాడు. ఈమేరకు శనివారం కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రశాంత్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిఏటా వందల మంది విద్యార్థులు శ్రీ చైతన్య విద్యాసంస్థలలో చనిపోతున్నారని, ఇటీవల ఖమ్మం జిల్లాలోని శ్రీ చైతన్య విద్యాసంస్థలో నందిని అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు.

నగరంలో పోలీస్ కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహించారు. మతసామరస్యం కాపాడటానికి పీఎస్ పరిధిలోని ముజాహిద్‌నగర్ నుంచి ఐదోటౌన్ వరకు సౌత్ రూరల్ సీఐ సురేష్, ఎస్సైలు గంగాధర్, వెంకటరావు, సుమారు 100 మంది సిబ్బంది కవాతులో పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ల అందజేత



బాధితులకు ఫోన్లను అందజేస్తున్న ఎస్‌హెచ్‌వో

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో సుమారు 18మంది ఫోన్లు పోగొట్టుకోగా, బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు విచారణ చేపట్టిన పోలీసులు సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. శనివారం పీఎస్‌లో బాధితులకు ఫోన్లను ఎస్‌హెచ్‌వో రఘుపతి అందజేశారు.

బహుజనులు మద్దతు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణుడు

నిజామాబాద్‌నాగారం: కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి బహుజన నేత మలక కొమరయ్యకు బహుజనులు మద్దతు ఇవ్వాలని బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు అన్నారు. ఎన్నికల్లో ఓటర్లు మొదటి ప్రాధాన్యత ఓటును కొమరయ్యకు వేసి, గెలిపించాలని కోరారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ పార్టీలు బీసీ, ఎస్సీ, ఎస్టీ , మైనార్టీలకు బహుజనులకు అవకాశం ఇవ్వవని అన్నారు. సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే హక్కు లేదు

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, దినేష్ కులాచారి

సుభాష్‌నగర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. 14 నెలల పాలనలో నిరుద్యోగులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చిన తర్వాతే ఓట్లు అడగాలన్నారు. నగరంలోని అర్బన్ ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ఆయన ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఓటర్లతో సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డి, శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హాజరై ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఓటర్లకు పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం అర్బన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులు, ఉపాధ్యాయులను మోసం చేసి ఏ మొఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. తెలంగాణ సమాజాన్ని మోసం చేసి ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టభద్రులు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. బీజేపీకి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరేటప్పుడు ఆత్మ పరిశీలన చేసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. రేవంత్‌రెడ్డి విసిరిన సవాల్‌కు బీజేపీ నాయకులు సిద్ధంగా ఉన్నారని, కేంద్రం చేసిన అభివృద్ధితోపాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అవినీతి చిట్టా కూడా విప్పడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగానికి బడ్జెట్ పెంచాలి



అభివాదం చేస్తున్న ఏఐపీఎస్‌యూ నాయకులు

నిజామాబాద్ రూరల్: విద్యారంగం బలోపేతం కావాలంటే ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపులు పెంచాలని అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏఐపీఎస్‌యూ) ఆలిండియా కార్యదర్శి షఫీఉల్లా అన్నారు. జిల్లా కేంద్రంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో శనివారం సంఘం రాష్ట్ర మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్యను కాషాయీకరణ చేసేందుకే నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొస్తుందని అన్నారు. శాస్త్రీయ విద్యా విధానాన్ని అభివృద్ధి చేసేందుకు విద్యార్థి సంఘం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఈ మహాసభలలో గత కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్ కార్యక్రమాలను రూపొందించుకోనున్నట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బోడ అనిల్, మన్నె కుమార్, నాయకులు యార్లగడ్డ సాయిబాబా, శివాజీ, ప్రభాకర్, విజయలక్ష్మి, సాయికుమార్, గోపాల్‌సింగ్, రాజు, ఆనంద్, పరమేశ్వర్ పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు, ప్రజలు

ఘనంగా కవలల దినోత్సవం



నిజామాబాద్ రూరల్: నగరంలోని విజయ్ హైస్కూల్‌లో శనివారం కవలల దినోత్సవాన్ని పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలలోని కవల విద్యార్థులకు కరస్పాండెంట్ ప్రభదేవి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల వ్యవస్థాపకురాలు అమృతలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సిరికొండ: మండల కేంద్రంలోని సత్యశోధక్ పాఠశాలలో కవలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా 14 కవల జంటలు నూతన వస్త్రాలు ధరించి అకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ నర్సయ్య, ఉపాధ్యాయులు గంగారెడ్డి, సతీష్, కవలలు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

పెర్కిట్: వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో టెక్నికల్ డీఈ రమేశ్ సూచించారు. ఆలూర్ మండల కేంద్రంలో శనివారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ రమేశ్ మాట్లాడుతూ.. రైతులు మోటార్ స్టార్టర్ల వద్ద భద్రత ప్రమాణాలతో ఎర్తింగ్ చేయించుకోవడం వల్ల విద్యుదాఘాతం కలగకుండా ఉంటుందన్నారు. హార్వేస్టర్ల వల్ల ప్రమాదాలు జరగకుండా ఎక్కువ ఎత్తులో విద్యుత్ స్తంభాలను అమరుస్తామన్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

నిజామాబాద్అర్బన్: తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు అన్నారు. నగరంలో ట్రస్మా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రయివేటు పాఠశాలలో పని చేస్తున్న టీచర్ల సమస్యలపై లోతైన అవగాహన ఉందన్నారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న ప్రయివేటు విద్యా వ్యవస్థను గాడిన పెట్టిన ఘనత తనదే అన్నారు. ప్రస్తుతం పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి విచ్చలవిడిగా డబ్బులు పంచుతున్నారన్నారు. దీనిని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అర్హులైన నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తానన్నారు. ట్రస్మా రాష్ట్ర కోశాధికారి జయసింహగౌడ్, జిల్లా అధ్యక్షుడు నిత్యనందం, జనార్దన్ నారాగౌడ్, శ్రీనివాస్, నగేష్, అరుణ్ పాల్గొన్నారు.

సీఎం సవాల్‌ను స్వీకరిస్తున్నా..

- చర్చకు సిద్ధమే.. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చి రావాలి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

బోధన్‌టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాలు గెలుస్తామని చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. హామీల అమలుకు ప్రణాళిక, కార్యాచరణ ప్రకటిస్తే చర్చకు సిద్ధమన్నారు. ఏ ఒక్క హామీకి కనీసం కార్యాచరణ లేదని, చర్చకు రమ్మనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బోధన్ పట్టణంలోని రమాకాంత్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన నియోజకవర్గ పట్టభద్రుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల పాలైందని, నిరుద్యోగులకు విస్మరించి అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలల్లోనే రూ. లక్షా30 వేల కోట్లు అప్పు చేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా లేరని పేర్కొన్నారు. దేశంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా సుస్థిర పాలన అందిస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న బీజేపీ బలపర్చిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు కొమరయ్య, అంజిరెడ్డిలను గెలిపించాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని సాధించాలి



డిచ్‌పల్లి ఎస్సీ బాలుర హాస్టల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ అంకిత్



హాస్టల్‌లో నిద్రిస్తున్న అడిషనల్ కలెక్టర్ అంకిత్

డిచ్‌పల్లి: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ అంకిత్ సూచించారు. పరీక్షలంటే భయాన్ని వీడి త్వరలో జరగబోయే పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. డిచ్‌పల్లి ఖిల్లా గ్రామంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను శుక్రవారం రాత్రి అడిషన్ కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాసన సామర్థ్యాన్ని పరిశీలించారు. రికార్డులు, వంటగది, మెస్ హాల్, స్టోర్ రూంను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. అనంతరం రాత్రి పిల్లలతోపాటు ఆయన హాస్టల్‌లోనే నిద్రించారు. ఉదయాన్నే నిద్రలేచిన తర్వాత పిల్లలకు ఇచ్చిన రాగిజావపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారిణి నిర్మల, ఇన్‌చార్జి అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ నాగమణి, అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ రాజగంగారాం ఉన్నారు.

మాలలను అణచివేయాలని చూస్తున్నారు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, పాల్గొన్న నాయకులు

నిజామాబాద్‌నాగారం: మందకృష్ణ మాదిగకు భయపడే మాలలను సీఎం రేవంత్‌రెడ్డి అణచివేయాలని చూస్తున్నారని జాతీయ మలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. నగరంలోని మాల సంఘ భవనంలో శనివారం జిల్లా అధ్యక్షులు పులి జైపాల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. షమీం అక్తర్ రిపోర్ట్ తప్పుల తడకగా ఉందని, మందకృష్ణ బెదిరింపులకు ముఖ్యమంత్రి భయపడుతున్నాడని అన్నారు. మాలల ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం మాలల్ని అణచివేస్తూ వారి ఉనికిని దెబ్బతీస్తున్నారన్నారు. మాల ఉప కులాలు మధ్య మందకృష్ణ మాదిగ చిచ్చుపెట్టి, విషం చిమ్ముతున్నాడని, తన పద్ధతిని మార్చుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతకు ప్రయత్నిస్తే మాల ల ఆగ్రహ జ్వాలలకు కాంగ్రెస్ గురవుతుందని హెచ్చరించారు. నాయకులు కిరణ్‌పాల్, చంద్రకాంత్, గంగారం, నారాయణ, ఎబినైజర్, దినాకర్, భాస్కర్, సుభాష్, సురేష్, బైండ్ల రాజన్న, మైకేల్, దయాకర్, సురేష్ టింకుల్, ఉదయ్, భరత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం



సిరికొండలో ప్రచారం నిర్వహిస్తున్న నేతలు

సిరికొండ: కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నాయకులు శనివారం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వారు పట్టభద్రులను కోరారు. అలాగే ధర్పల్లిలో ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ నాయకులతో శనివారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్ సమావేశం నిర్వహించారు. పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని శ్రేణులకు సూచించారు. అనంతరం ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, సిరికొండ మండలాధ్యక్షుడు బాకారం రవి, సంతోష్‌నాయక్, ఆసిఫ్, చల్ల రాజారెడ్డి, బడాల మహిపాల్, మొట్టల రాము, జీవన్‌నాయక్, మోజీరాం, చెలిమెల నర్సయ్య, ధర్పల్లి సొసైటీ చైర్మన్ మల్లికార్జున్, మిట్టాపల్లి గంగారెడ్డి, అబ్దుల్ హమీద్, సురేందర్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, పుప్పాల సుభాష్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్: మండలంలోని గూపన్‌పల్లిలో శనివారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా టీపీసీసీ ప్రతినిధి బాడ్సి శేఖర్‌గౌడ్ ప్రచారం చేశారు. పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను కోరారు. నాయకులు నరేందర్, బైపాస్ లింగన్న, జోగిని శ్యామ్, చంద్రశేఖర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



గుపన్‌పల్లి గ్రామంలో..

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	89,300	వెండి(కిలో)	1,02,000
22 క్యారెట్స్	82,415	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	160
		లైవ్	100
స్కిన్‌లెస్	180	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	15	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	25	50
బీరకాయ	50	80	దోసకాయ	30	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	30	50	గోబిగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిపువ్వు	20	40
వంకాయ	10	20	బీట్‌రూట్	25	50
పాలకూర	20	40	కరివేపాకు	60	110
మెంతికూర	30	50	చామగడ్డ	40	60
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	80	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	జాబిలమ్మ నీకు అంత కోపమా -11.00, 1.40, 7.30 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్-4.30, 10.20
స్క్రీన్-2	ఛావా(హిందీ)-11.00,1.40,4.40, 7.30, 10.20
స్క్రీన్-3	తండేల్(తెలుగు)-1.45, 4.40, 7.30 బాపు(తెలుగు)-10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-10.15, 4.00, 7.10, 10.20 బాపు(తెలుగు)-1.25
స్క్రీన్-2	ఛావా(హిందీ)-10.00, 7.20, 10.40 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-1.20 జాబిలమ్మ నీకు అంత కోపమా -4.30
స్క్రీన్-3	జాబిలమ్మ నీకు అంత కోపమా-10.30 ఛావా(హిందీ)-1.20 తండేల్(తెలుగు)-4.40, 10.20 బాపు(తెలుగు)-7.45
స్క్రీన్ -4	ది డెవిల్స్ చైర్(తెలుగు)-11.30 రామం రాఘవం(తెలుగు)-1.45 ఛావా(హిందీ)-4.20 సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)- 7.40 జాబిలమ్మ నీకు అంత కోపమా-10.40
లలితామహల్	తండేల్(తెలుగు)
దేవి	జాబిలమ్మ నీకు అంత కోపమా(తెలుగు)-11.15, 6.15 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-2.15, 9.15
నటరాజ్	ఛావా(హిందీ)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)

సంక్షిప్తం

విద్యార్థులకు స్టడీ చైర్ల వితరణ



జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు 25 స్టడీ చైర్‌లు, రైటింగ్ ప్యాడ్‌లను శనివారం విపి ఉన్నతస్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఆనంద్‌వల్లి(ఎన్నారై) కేరళ అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, పాఠశాల చైర్మన్ గంగాజమున, జిల్లా పీఆర్టీయూ అసోసియేట్ అధ్యక్షుడు గంట అశోక్, మండల అధ్యక్షుడు గోపి, ప్రధాన కార్యదర్శి రవీన్, పీడీ గంగామోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వైద్యశిబిరం



నిజామబాద్ రూరల్: రూరల్ మండలం పాంగ్రా శివారులోని రెయిన్‌బో పాఠశాలలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వైద్యులు మజాజ్ అహ్మద్‌ఖాన్ వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

మోపాల్: గురుకుల పాఠశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌కు మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రిన్సిపాల్ మురళీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల వరకే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, 11 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆలస్యమైతే పరీక్ష కేంద్రంలోనికి అనుమతించబోమన్నారు.

విద్యార్థులకు పండ్ల పంపిణీ



నిజామాబాద్ రూరల్: డిచ్‌పల్లి మండలకేంద్రంలోని మానవతా సదన్‌లో విద్యార్థులకు శనివారం రాష్ట్ర ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు, టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం రమాజగదీశ్వర్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా పండ్లు పంపిణీ చేశారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాశెట్టి సుమన్ కుమార్, నేతికుంట శేఖర్, చిట్టి నారాయణ రెడ్డి, పోల శ్రీనివాస్, గంధం వెంకటేశ్వర్లు, జాకీర్, జ్ఞానేశ్వర్ రెడ్డి, జాఫర్, సునీల్, సుధాకర్ ఉన్నారు.

నియామకం



నిజామాబాద్‌నాగారం: జాతీయ మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శిగా డాక్టర్ పులి జైపాల్ నియమితులయ్యారు. ఈమేరకు నగరంలో శనివారం ఆయనకు నియామకపత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అందజేశారు.

నేడు కుమ్మర సంఘం భవనం ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఆర్యనగర్‌లో నూతనంగా నిర్మించిన కుమ్మర సంఘం భవనాన్ని ఆదివారం ప్రారంభించనున్నట్లు కుల పెద్దలు, సంఘం గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ రూ. 5లక్షల నిధులు ఇవ్వడంతోపాటు దాతాలు సైతం విరాళాలు ఇవ్వడంతో భవనం పూర్తయిందని తెలిపారు. సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్, గైడ్స్‌తో క్రమశిక్షణ

సిరికొండ: స్కౌట్స్, గైడ్స్‌లో చేరడం వల్ల విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉంటారని సిరికొండ ఏఎస్సై రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని సత్యశోధక్ పాఠశాలలో శనివారం స్కౌట్స్, గైడ్స్ వ్యవస్థాపకులు రాబర్ట్ బడెన్ పావెల్ జయంతి, ప్రపంచ ఆలోచన దినోత్సవాన్నినిర్వహించారు. అనంతరం రోడ్డు భద్రతా నియమాలపై రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. స్కౌట్స్, గైడ్స్ రాష్ట్ర బాధ్యులు సాల్మన్, ప్రిన్సిపాల్ నర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లి మండలం బీబీపూర్ శివారులోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సయ్యద్ అయూబ్ అలీ (46) శనివారం మృతి చెందినట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నగరంలోని ముజాయిద్‌నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్లా రహమాన్ (25), మహ్మద్ షహీద్, మొయినుద్దీన్ ఖాన్, సయ్యద్ అయూబ్ అలీ శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. కారులో ప్రయాణిస్తున్న షేక్ అబ్దుల్లా రహమాన్ అక్కడికక్కడే మృతి చెందగా, అయూబ్ అలీ హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.